ఆలయ చైర్మన్‌ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు పూర్తి


తటాకం నారాయణ

కీసర: తెలంగాణలోనే సుప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం నూతన చైర్మన్‌గా తటాకం నారాయణ ఈనెల 6న (సోమవారం) ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు దేవస్థానం ఆధ్వర్యంలో కొత్త చైర్మన్‌ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి దేవస్థానం తరపున అన్నీ ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆలయ ఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

హిమగిరి కాలనీ అసోసియేషన్‌ ఏర్పాటు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని జోడిమెట్లలో హిమగిరి కాలనీ అసోసియేషన్‌ ఏర్పాటు చేసినట్లు కాలనీ అధ్యక్షుడు ఆకిటి కృష్ణారెడ్డి తెలిపారు. ఉపాధ్యక్షులుగా జిల్కపల్లి బాలయ్య, వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నిమ్మకాయల శివరాం, కోశాధికారిగా రమేష్‌, కార్యదర్శులుగా దేవసేనంచారి, ఐలయ్య, నర్సింహ నాయక్‌, భరత్‌రెడ్డి నియమితులైనట్లు తెలిపారు.

అన్నప్రసాద వితరణ

కీసర: భక్తుల కొంగు బంగారంగా పేరొందిన శ్రీ చీర్యాల లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద శనివారం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా దేవాలయ చైర్మన్‌ మల్లారపు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. చీర్యాల లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ప్రతి శనివారం మధ్యాహ్నం ఉచితంగా అన్నప్రసాద వితరణ చేపట్టడం జరుగుతుందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ధర్మకర్త శ్రీహరిగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తాం

ఘట్‌కేసర్‌: శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య అన్నారు. శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కౌన్సిలర్‌ వెంకట్‌రెడ్డి, ముస్లింలు చైర్‌ పర్సన్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ వెంకట్‌రెడ్డి, జంగయ్యయాదవ్‌, మైనారిటీ అధ్యక్షుడు ఫరూక్‌, మాజీ అధ్యక్షుడు కుతుబ్‌, అన్ను, నజీర్‌, ఖలీల్‌, షకీల్‌, జహంగీర్‌, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

మేడ్చల్‌రూరల్‌: ప్రభుత్వ స్థలంలో నెలకొల్పిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు నేలమట్టం చేసి ప్రభుత్వ స్థలాన్ని తమ స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని మైసిరెడ్డి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్‌ 6/34లో గల ప్రభుత్వ స్థలాన్ని 2019లో మల్లిగారి జార్జ్‌ రెవెన్యూ అధికారుల సాయంతో తన పేరిట నమోదు చేయించుకున్నాడు. ప్రస్తుతం ఆ స్థలంలో క్రికెట్‌ గ్రౌండ్‌ ఏర్పాటు చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేసి వ్యాపారం సాగిస్తున్నాడని గ్రామస్తులు పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా.. విచారణ చేపట్టిన రెవెన్యూ శాఖ ప్రభుత్వ రికార్డులు, స్థలాన్ని పరిశీలించి సర్వే నిర్వహించి ప్రభుత్వ స్థలంగా తేల్చారు. అసైన్డ్‌ ల్యాండ్‌ చట్టానికి వ్యతిరేకంగా అమ్మకాలు జరగడంతో రెవెన్యూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మేడ్చల్‌ తహసీల్దార్‌ శైలజ, ఆర్‌ఐలు అక్రమ నిర్మాణాలను శనివారం తొలగించి భూమిని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ నిర్మాణాలను తొలగించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గోరక్షకులపై కేసులు పెట్టడం సబబు కాదు

ఘట్‌కేసర్‌: గోరక్షకులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి బీజేపీ మున్సిపల్‌ అధ్యక్షుడు హనుమాన్‌ డిమాండ్‌ చేశారు. పట్టణంలోని శనివారం ఆయన మాట్లాడుతూ.. జనవరి 1న కొండమడుగు వారం సంత నుంచి బహాదూర్‌పూర్‌కు గోవులను తరలిస్తున్న వాహనాన్ని ఆపే ప్రయత్నం చేసిన గోరక్షకులపై పోలీసులు కేసులు పెట్టడం సమంజసం కాదన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా గోరక్షకుడు వినయ్‌ను ఇంటిలో నుంచి తీసుకువెళ్లడం, మూడు రోజుల తర్వాత ఎఫ్‌ఐఆర్‌లో పేర్లు లేని భరత్‌, మనీష్‌, శివసాయిను రిమాండ్‌కు తరలించడం ఏంటని ప్రశ్నించారు. అక్రమంగా గోవులు తరలించకుండా పోలీస్‌ క్యాంపు ఏర్పాటు చేయాలని, గోవధ చట్టాలు కఠినంగా అమలు చేయాలని, గోరక్షకులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

కొవ్వొత్తులతో నివాళులర్పించిన కార్మికులు



కీసర: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త మన్నెం సుబ్రహ్మణ్యంకు మన్నెం ఇండస్ట్రీస్‌ ఎం పవర్‌ ఇన్‌ఫ్రాటెక్‌ కార్మికులు శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు.

ఐదేళ్లని చెప్పి 20 ఏళ్లుగా కొనసాగిస్తున్న డంపింగ్‌

కాలుష్య ప్రభావం ఏళ్ల తరబడి ఉంటుందని పర్యావరణ వేత్తల హెచ్చరిక

గృహకల్ప, సమీప ప్రాంతాలకు శాపంగా మారిన వైనం

రంగుమారిన బోరునీరు

రాత్రింబవళ్లు ఈగలు, దోమల బెడద

అనారోగ్యం బారిన పరిసర ప్రాంత వాసులు

సమస్యలు పరిష్కరించాలని స్థానికుల ఆవేదన



ఊపిరాడనివ్వని దుర్గంధం..
కోరలు చాచిన కాలుష్యం

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌లోని డంపింగ్‌యార్డ్‌, పవర్‌ప్లాంట్‌ ప్రజలపాలిట శాపంగా మారింది. ఈ యార్డువల్ల జల, వాయు కాలుష్యం ఏర్పడి ముఖ్యంగా జవహర్‌నగర్‌, దమ్మాయిగూడ, చిర్యాల, రాంపల్లి, మల్కారం, నాగారం, తిమ్మాయిపల్లి, అహ్మద్‌గూడ ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. క్లీన్‌ అండ్‌ గ్రీన్‌ నినాదంతో ప్రభుత్వం జంట నగరాలలోని చెత్తా చెదారాన్ని సేకరించి లారీల ద్వారా తరలించి శివారు ప్రాంతమైన జవహర్‌నగర్‌లో డంపింగ్‌ చేస్తున్నారు. ఐదేళ్లు మాత్రమే డంపింగ్‌ చేస్తామని ప్రారంభించిన డంపింగ్‌యార్డ్‌ 20 ఏళ్లయినా ఇంకా కొనసాగుతోంది. ఇంకా కొన్నేళ్లు చెత్త వేయడానికి ప్రైవేటు కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. నేడు ఈ ప్రాంతమంతా కాలుష్య జోన్‌గా మారి స్థానికంగా 20 కిలోమీటర్ల పరిధిలో నివసించే ప్రజలందరికి అనారోగ్యాన్ని పంచుతోందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. జవహర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్‌ యార్డ్‌తో ఈ పరిసర ప్రాంత చెరువులు, కుంటలు, బోరుబావులు కలుషితమై జల జీవరాసుల మనుగడకు ప్రమాదకరంగా మారింది. జీహెచ్‌ఎంసీ నిబంధనల ప్రకారం చెత్త డంపింగ్‌ యార్డ్‌ ఒకే చోట ఐదేళ్లకు మించి ఉండరాదు. కానీ జవహర్‌నగర్‌లో డంపింగ్‌ ఏర్పాటు చేసి 20 ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం కానీ, అధికారులు గానీ ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. నగరం నుంచి వందల టన్నులకు పైగా చెత్తను ఈ ప్రాంతంలోనే డంప్‌ చేస్తున్నారు. ఈ పొగమూలంగా వాయు కాలుష్యం ఏర్పడి చుట్టూ ఉన్న ప్రాంతాల ప్రజలు జబ్బున బారిన పడి అనారోగ్యాల పాలవుతున్నారు. ఈ డంపింగ్‌ యార్డ్‌లో కాలిన చెత్త ద్వారా వెలువడే చమురులాంటి ద్రవ పదార్థాలు భూమిలోకి ఇంకి పరిసర ప్రాంతాల్లోని చెరువులు, బోరు బావుల్లోకి ఇంకిపోతున్నాయి. దీంతో ఆయా చెరువుల్లో ఉండే జీవరాసులు ఆ నీటిని తాగుతున్న జంతువులు, పక్షులు మృత్యువాత పడుతున్నాయి. ఐదేళ్లకు మించి డంపింగ్‌ చేస్తే దాని కాలుష్యం ఆ చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలలో సుమారు 20 ఏళ్ల వరకు ఉంటుందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాంటిది ఈ ప్రాంతంలో ఏళ్లుగా చెత్త డంపింగ్‌ చేస్తున్నారంటే ఈ పరిసర ప్రాంతాల్లో భూమి ఎంతగా కాలుష్యమైందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో తాము ఈ ప్రాంతంలో జీవించగల పరిస్థితి ఉండదని, ఇది మానవ మనుగడకే ప్రమాదంగా మారిందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని జవహర్‌నగర్‌ చెత్త డంపింగ్‌ యార్డ్‌ను దూర ప్రాంతాలకు తరలించి ప్రజల ప్రాణాలు కాపాడాలని వేడుకుంటున్నారు.


డంపింగ్‌యార్డ్‌ వల్ల కలుషితమైన నీరు

దుర్వాసనభరితం..

కాప్రా మండల పరిధిలోని జవహర్‌నగర్‌ ఒకప్పుడు వ్యవసాయానికి అనువైన ప్రాంతం. ఇక్కడ చాలా మంది రైతులే ఉండేవారు. భూముల్లో బంగారం పండేది. ఇదంతా గతం.. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. తాగడానికి సరైన నీరులేదు.. అధ్వానమైన రోడ్లు ఆహ్వానం పలుకుతున్నాయి. ఉన్నది ఒక్క రోడ్డే అయినా దానిపై మురుగునీరు ఏరులైపారుతోంది. గ్రేటర్‌ హైదరాబాద్‌కు సమీపంలో ఉండంతో వ్యవసాయబావులన్నీ కనుమరుగైయ్యాయి. దాదాపు 3 లక్షల జనాభ ఉన్న పట్టణం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచింది. అంతేకాకుండా పట్టణంలో డంపింగ్‌యార్డ్‌ ఏర్పాటు చేయడంతో కష్టాలు ఇంకా ఎక్కువైయ్యాయి. రాత్రిళ్లు వెలువడుతున్న దుర్వాసనను ప్రజలు భరించలేకపోతున్నారు. ముక్కుకు కర్చీఫ్‌లు పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారు. ఇలా 20 ఏళ్ల నుంచి భరిస్తున్నామని అక్కడి స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్‌ కార్పొరేషన్‌గా ఏర్పడి 28 కార్పొరేటర్లతో మేయర్‌, డిప్యూటీ మేయర్‌ అతి పెద్ద పాలకవర్గం ఏర్పడినా నిధులు మాత్రం అరకొరగా ఇస్తుండడంతో అభివృద్ధి పనులకు సరిపోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. రోడ్ల మధ్యనే డ్రైనేజీ ఏర్పాటు చేయడంతో నడవలేకపోతున్నామంటున్నారు. ఇప్పటికైనా డంపింగ్‌యార్డ్‌ను తరలించి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వాసన భరించలేకపోతున్నాం



చెత్త డంపింగ్‌యార్డ్‌ పక్కనే ఉన్న మా కాలనీలలో సుమారు వందల కుటుంబాలు జీవిస్తున్నాయి. ఇందులో చాలా కుటుంబాల వారు చర్మవ్యాధులతో బాధపడుతున్నారు. రాత్రి దోమలతో, పగలు ఈగలతో నానా అగచాట్లు పడుతున్నారు. మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము.

- పరమేష్‌చారి, అంబేద్కర్‌నగర్‌

పవర్‌ప్లాంట్‌తో పరేషాన్‌..



ఐదు సంవత్సరాల క్రితం డంపింగ్‌యార్డ్‌లో పవర్‌ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఈ ప్రాంతంలో శబ్ద కాలుష్యం మొదలైంది. డంపింగ్‌ యార్డు పరిసర ప్రాంతాలలో నివసించలేకపోతున్నాం. డంపింగ్‌ యార్డు కలుషిత నీరు తాగి పశువులు, పక్షులు మరణిస్తున్నాయి. ఇక్కడ ప్రజలందరూ కూడా రోగాలబారిన పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పారిశుద్ధ్యంపై చర్యలు తీసుకోవాలి. వీలైనంత త్వరగా డంపింగ్‌ను తరలించాలి.

- మారం సమ్మిరెడ్డి,
డంపింగ్‌ జేఏసీ కో-కన్వీనర్‌


డంపింగ్‌యార్డ్‌ కలుషిత నీటితో ఎండిపోయిన తాడిచెట్లు

శ్వాసకోశ, చర్మవాధ్యులతో జనాలు..

జవహర్‌నగర్‌ పరిసర ప్రాంతాల ప్రజలు ప్రస్తుతం శ్వాసకోశ, చర్మవాధ్యులతో బాధపడుతున్నారు. ప్రతీ కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు జ్వరం బారిన పడుతున్నారు. బోరునీరు కలుషితమై చర్మసంబంధిత వ్యాధుల బారినపడుతున్నారు. చెత్త వల్ల పగలు ఈగలు, రాత్రి దోమల బెడదతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మలేరియా, దగ్గు, జలుబు, జ్వరం, వాంతులు, విరేచనాలు లాంటి వ్యాధులు సోకుతున్నా అధికారులు, వైద్య బృందం పట్టించుకున్న దాఖలాలులేవు.


జవహర్‌నగర్‌ డంపింగ్‌యార్డ్‌

సీఎంకు ధన్యవాదాలు

మేడ్చల్‌: మేడ్చల్‌ వరకు మెట్రో లైన్‌ను విస్తరించాలని సీఎం రేవంత్‌రెడ్డి అనుమతులు జారీ చేయడంతో మండల, మున్సిపల్‌ కాంగ్రెస్‌ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డిని స్థానిక కాంగ్రెస్‌ నాయకులు ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో నాయకులు రమణారెడ్డి, బాల్‌రెడ్డి, వరదారెడ్డి, పోచయ్య, సురేందర్‌ ముదిరాజ్‌, సుదర్శన్‌రెడ్డి, మురళీగౌడ్‌, కౌన్సిలర్‌ రాజు తదితరులు ఉన్నారు.

డిగ్రీ కళాశాల కోసం వినతి..

మేడ్చల్‌లో పేద విద్యార్థులు ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న మేడ్చల్‌లోని రైల్వే అండర్‌ పాస్‌ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయించాలని నాయకులు సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.


వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్‌ అధ్యక్షుడు రమణారెడ్డి


సీఎం రేవంత్‌రెడ్డికి న్యూ ఇయర్‌ శుభాకాంక్షలు తెలుపుతున్న మేడ్చల్‌-మల్కాజ్‌గిరిజిల్లా యూత్‌ కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి ఆసర్ల మౌనిక బీరప్ప, ఉపాధ్యక్షురాలు పాలేపు నాగలక్ష్మి కోటేష్‌

శిథిలాలను తొలగించి దారి సుగమం చేయాలి

ఘట్‌కేసర్‌: కూల్చివేసిన శిథిలాలను తొలగించి ప్రజల రాకపోకలకు దారి సుగమం చేయాలని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య అన్నారు. మున్సిపాలిటీలో నిర్మిస్తున్న రైల్వే వంతెన నిర్మాణంలో భాగంగా రోడ్డు విస్తరణలో కూల్చివేత పనులను శనివారం పరిశీలించారు. చైర్‌ పర్సన్‌ మాట్లాడుతూ.. అధికారులు గుర్తించిన సరిహద్దు వరకు వదిలేసి నిర్మాణం చేసుకోవాలని కట్టడాల యజమానులకు సూచించారు. శిథిలాల తొలగింపు పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రవాణశాఖ ఏఈ రంజిత్‌, జంగయ్యయాదవ్‌, స్థానికులు పాల్గొన్నారు.



రోడ్డు భద్రత మాసోత్సవాలని విజయవంతం చేస్తాం

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించటానికి పకడ్బందిగా చర్యలు తీసుకోవటంతోపాటు ప్రజల్లో అవగాహన పెంచటానికి విద్యాసంస్థలతోసహా జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతా మాసోత్సవాలని విజయవంతంగా నిర్వహిస్తామని కలెక్టర్‌ గౌతమ్‌ తెలిపారు. శనివారం హైదరాబాద్‌ నుంచి రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌, రోడ్లు భవనాల శాఖ స్పెషల్‌ చీఫ్‌ సెక్రటరీ వికాస్‌రాజ్‌తో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించగా, మేడ్చల్‌ కలెక్టరేట్‌ నుంచి కలెక్టర్‌ గౌతమ్‌, జిల్లా అదనపు కలెక్టర్‌ రాధికాగుప్తా, రోడ్లు భవనాల శాఖ ఈఈ శ్రీనివాస్‌ మూర్తి, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు. కాన్ఫరెన్స్‌లో మేడ్చల్‌ జిల్లాలో తలపెట్టిన రోడ్డు భద్రతా మాసోత్సవాలని కలెక్టర్‌ గౌతమ్‌ వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. సంక్రాంతి సెలవుల తర్వాత విద్యార్థులచే ప్రతి జిల్లా, మండల హెడ్‌ క్వార్టర్‌లో భారీ ర్యాలీ చేపట్టాలని అన్నారు. రవాణా శాఖ, పోలీస్‌ శాఖ, విద్యాశాఖ, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్‌ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రోడ్డు భద్రత కార్యక్రమాలు విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని మంత్రి తెలిపారు.



పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర కీలకం

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ పథకాలను అర్హులైన పేదలకు చేరవేయటంలో అధికారులు, ఉద్యోగుల పాత్ర గణనీయమైందని మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ అన్నారు. కలెక్టరేట్‌లో టీజీఓఎస్‌ జిల్లా అసోసియేషన్‌ నూతన సంవత్సరం సందర్భంగా రూపొందించిన 'టీజీఓఎస్‌-2025' కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండటంతోపాటు మేడ్చల్‌ జిల్లాను ప్రగతి పథంలో తీసుకెళ్లేందుకు తమ వంతు పాత్రను ప్రభుత్వ ఉద్యోగులు నిర్వహించాలని కోరారు. ప్రజలకు అవసరమైన సేవలను అందించటం ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకోవటానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఓఎస్‌ జిల్లా అసోసియేషన్‌ అధ్యక్షుడు వినోద్‌కుమార్‌, కార్యదర్శి కురుమూర్తి, జిల్లా అసోసియేషన్‌ నేతలు విజయకుమారి, రవీందర్‌, రఘునాథన్‌గౌడ్‌, సాయికృష్ణ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

నేడు గిర్మాపూర్‌ గుట్టల మల్లన్న జాతర

మేడ్చల్‌: ప్రతి సంవత్సరం మొదటి ఆదివారం ఘనంగా నిర్వహించే గిర్మాపూర్‌ గుట్టల మల్లన్న జాతరను నేడు నిర్వహిస్తున్నట్లు ఉత్సవాల కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి సంవత్సరం మొదటి ఆదివారం ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జాతర సందర్భంగా బోనాల సమర్పణ, పోతరాజుల నృత్యాలు తొట్టెల ఊరేగింపులు, ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగు ఏర్పాట్లను కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు పరిశీలన

పోచారం: ప్రతాపసింగారం బ్రిడ్జి వద్ద గుంతలు పడిన రోడ్డును మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి చైర్మన్‌ కొండల్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్‌ మాట్లాడుతూ.. రహదారికి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ మహిపాల్‌, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ వాణి, మాజీ ఉప సర్పంచ్‌ బాల్‌రెడ్డి, మున్సిపల్‌ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో మేడ్చల్‌ జిల్లాకు 117 మెడల్స్‌

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌-మల్కాజిరి జిల్లాకు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలలో 117 మెడల్స్‌ వచ్చినట్లు జిల్లా క్రీడల అధికారి గోపాల్‌రావు తెలిపారు. ఈ పోటీల్లో జిల్లా క్రీడాకారులు 37 గోల్డ్‌, 42 సిల్వర్‌ 42, 38 బ్రాంజ్‌ వచ్చాయన్నారు. టీమ్‌ గేమ్‌లో గెలుపొందిన మొదటి విజేతకు రూ. లక్ష, రెండో విజేతకు రూ. 75 వేలు, మూడో విజేతకు రూ. 50 వేల నగదు అందజేస్తారన్నారు. అలాగే, వ్యక్తిగత క్రీడాంశంలో మొదటి విజేతకు రూ. 20 వేలు, రెండో విజేతకు రూ. 15 వేలు, మూడో విజేతకు రూ. 10 వేలు నగదు రూపంలో సీఎం కప్‌-2024తో పాటుగా అందజేస్తారన్నారు.

ఆయుర్వేద వైద్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలి


కషాయ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య, ఆయుర్వేద వైద్యుడు ఆనందయ్య

ఘట్‌కేసర్‌: ఆయుర్వేద వైద్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని శనివారం అగస్త్య ట్రెడిషనల్‌ క్యూర్‌ ఆశ్రమంలో 'దశ అమృత నిర్గుండి కషాయం' ఉచిత పంపిణీ కార్యక్రమానికి కరోనా నివారణ మందు కనిపెట్టిన ఆయుర్వేద పారంపర్య వైద్యుడు ఆనందయ్యతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రముఖ ఆయుర్వేద వైద్యులు ఆనందయ్య పర్యవేక్షణలో కాషాయం తయారు చేసి ప్రతి ఆదివారం పేదలకు సింహాచలం లక్ష్మణా స్వామి అందజేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ మల్లేష్‌, ఆయుర్వేద విశ్రాంత అధ్యాపకుడు రఘుపతి, ఆయుర్వేద ట్రెడిషనల్‌ క్యూర్‌ ఆశ్రమం నిర్వాహకుడు వెంకటేశ్వర్లు, నాయకులు జంగయ్యయాదవ్‌, వీరేందర్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ పార్టీలో చేరికలు

కీసర: కాంగ్రెస్‌ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పెద్ద ఎత్తున వివిధ పార్టీలకు చెందిన నేతలు కాంగ్రెస్‌ పార్టీలో చేరుతున్నారని నాగారం మున్సిపల్‌ కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్‌ పరిధిలోని రాజ్‌సుఖ్‌నగర్‌ మాజీ అధ్యక్షులు దాసు, మల్లారెడ్డి తదితరులు కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌ పార్టీ మున్సిపాలిటీలో మరింత బలోపేతం కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, హరిబాబు, అన్నంరాజుసుమిత్ర సురేష్‌, మాజీజెడ్పీటీసీ ముప్పురాం రెడ్డి, మాజీ సర్పంచ్‌ అశోక్‌గౌడ్‌, సీనియర్‌ నేతలు కొండల్‌రెడ్డి, సంతోష్‌, వేణుగోపాల్‌, బాబురావు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు

కీసర: నాగారం మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టినట్లు నాగారం మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్లచంద్రారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్‌ పరిధిలోని 14వ వార్డులోని సంతోష్‌నగర్‌ కాలనీలో సుమారు రూ. 5 లక్షల మున్సిపల్‌ నిధులతో చేపట్టనున్న కాంపౌండ్‌ వాల్‌ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ బండారి మల్లేష్‌ యాదవ్‌, కౌన్సిలర్‌ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్‌ ప్రదానం

పోచారం: చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి ఫార్మసీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న అసోసియేట్‌ ప్రొఫెసర్‌ పింగళి శ్రీనివాసరావుకు రాజస్థాన్‌లోని మేవార్‌ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ లభించింది. 'ఫార్ములేషన్‌ అండ్‌ ఇవాల్యుయేషన్‌ ఆఫ్‌ ఫాస్ట్‌ డిసాల్వింగ్‌ ఓరల్‌ ఫిల్మ్స్‌ కంటెయినింగ్‌ రాసజిలైన్‌ మెజిలేట్‌ అండ్‌ సెలిజిలైన్‌' అనే అంశంపై శ్రీనివాసరావు చేసిన పరిశోధనకు డాక్టరేట్‌ డిగ్రీని విశ్వవిద్యాలయం ప్రదానం చేసింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావును కళాశాల డైరెక్టర్‌ డా. సీవీ కృష్ణారెడ్డితో పాటు ఫార్మసీ విభాగాధిపతి ప్రొఫెసర్‌ కృష్ణ మోహన్‌ చిన్నాల, అధ్యాపక బృందం అభినందించింది.

మున్నూరు కాపు కేలండర్‌ ఆవిష్కరణ



జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించిన 2025 నూతన సంవత్సర కేలండర్‌ని శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రావు, సత్యనారాయణ, బాలరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.